## క్లుప్తంగా

### ముస్తాబవుతున్న వీరభద్రేశ్వర ఆలయం



గర్భగుడికి రంగులు వేస్తున్న దృశ్యం

**రాయికోడ్(అందోల్):** రాయికోడ్‌లోని భద్రకాళీ సమేత వీరభద్రేశ్వర దేవాలయం జాతరకు ముస్తాబవుతోంది. ఏప్రిల్ 10 నుంచి 15వ తేదీ వరకు జాతర నిర్వహించేందుకు ఆలయ అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా ఆలయంలో రంగులు వేసే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసే భక్తులకు వేసవి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అధికారులు మోహన్‌రెడ్డి, కృష్ణలు తెలిపారు.

### సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కులు అందజేస్తున్న ప్రభాకర్ తదితరులు

**జిన్నారం(పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో నలుగురికి మంజూరైన రూ.1.60లక్షల చెక్కులను శనివారం జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్ చంద్రారెడ్డిలు అందించారు. అన్ని వర్గాల ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్‌రెడ్డి, గోపాలమ్మ, వెంకటయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల్లో సేవాభావం పెంపు



మాట్లాడుతున్న సర్పంచ్ నర్సింలు

**పటాన్‌చెరు టౌన్:** విద్యార్థులలో సేవాభావాన్ని పెంపొందించడానికి ఎన్‌ఎస్‌ఎస్ ఉపయోగపడుతుందని ఇంద్రేశం గ్రామ సర్పంచ్ దండు నర్సింలు అన్నారు. ఇంద్రేశంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఉపసర్పంచ్ శివకుమార్ గౌడ్, గ్రామ పెద్దలు రామచంద్రారెడ్డి, కార్యదర్శి సుభాష్, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీహరిరెడ్డి, డాక్టర్ జానా రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ప్లాస్టిక్‌పై విద్యార్థులకు అవగాహన**

**జిన్నారం(పటాన్‌చెరు):** కానుకుంట గ్రామంలో బేగంపేట మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు శనివారం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నీరజ, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు కమ్మరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌టీపీలో చేరికలు

**నారాయణఖేడ్:** నిజాంపేట్ మండలం కొత్తపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు శనివారం వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. చేరిన వారిలో దుర్గయ్య, సాయిలు, శంకర్, సంగన్న, లక్ష్మయ్య, బోర్గి సంగన్న, రాజు, మహేష్ తదితరులు ఉన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గోవింద్, భల్‌భీంనాయక్ పాల్గొన్నారు.

### గడపగడపకూ కాంగ్రెస్

**జిన్నారం(పటాన్‌చెరు):** గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా పార్టీ చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని మండల పార్టీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి అన్నారు. మండలంలోని అనంతారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

### యువతి ఆత్మహత్య

**రామచంద్రాపురం (పటాన్ చెరు):** సరైన ఉద్యోగం లభించలేదన్న మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీకి చెందిన కుసుమ (20) డిగ్రీ వరకు చదువుకుంది. గతంలో ఓ సంస్థలో పనిచేసింది. కొద్ది కాలంగా ఖాళీగా ఉంటోంది. సరైన ఉద్యోగం రావడం లేదన్న మనస్తాపంతో శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇంటికొచ్చి చూసిన వెంటనే ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గుంతలే..గుంతలు

**ఇదీ బొల్లారం ప్రధానరోడ్డు దుస్థితి**



గుంతలమయంగా బొల్లారం ప్రధాన రోడ్డు

**జిన్నారం(పటాన్‌చెరు):** పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా సమస్యలు మాత్రం తీరనేలేదు. ఏటేటా బొల్లారం మున్సిపాలిటీ ఆదాయం పెరుగుతున్నా అభివృద్ధి పనులు మాత్రం ఆశించినస్థాయిలో జరగడం లేదు. నిధులు కేటాయింపు జరుగుతున్నా..పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. బొల్లారం మున్సిపాలిటీగా ఆవిర్భవించి ఐదేళ్లవుతోంది. అప్పట్లో ఆదాయం రూ.3కోట్లు ఉండగా. ప్రస్తుతం మున్సిపల్ ఆదాయం రూ.10కోట్లకు చేరింది. బొల్లారంలోని బస్‌స్టేషన్ నుంచి పాత మున్సిపల్ కార్యాలయం వరకు, అక్కడి నుంచి ఇండస్ట్రీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దాదాపు చిన్నాచితక గుంతలన్నీ కలిపి వందకుపైగానే ఉంటాయి. నిత్యం ఈ రోడ్డుపై వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. నాయకులు, అధికారులు కూడా ఈ మార్గం నుంచే వెళుతున్నా రోడ్డు సమస్య గురించి ఎనాడూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఈ రోడ్డు వేసేందుకు రూ.90 లక్షల వరకు అధికారులు కేటాయించారు. కానీ ఇందుకు సంబంధించిన పనులు మాత్రం ప్రారంభం కావటం లేదు. రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఎప్పుడో వేసిన రోడ్డు ప్రస్తుతం అలాగే ఉంది. ఈ రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు చాలాసార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించారు. అయినా ఫలితం లేకుండా పోయింది.

**దశలవారీగా పనులు చేయిస్తున్నాం**

మున్సిపాలిటీ పరిధిలోని కాలనీలను అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నాం. రోడ్లు కూడా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బొల్లారంలోని ప్రధాన రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభిస్తాం.

– రాజేంద్రకుమార్, బొల్లారం కమిషనర్

**నిధులు కేటాయిస్తున్నా పనులు జరగటం లేదు:**



ప్రతి సమావేశంలో రోడ్ల అభివృద్ధి పేరిట నిధులు కేటాయిస్తున్నారు. అయినా పనులు మాత్రం జరగటం లేదు. ఈ విషయంలో అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. బొల్లారంలోని ప్రధాన రోడ్డు అధ్వానంగామారింది. ఈ రోడ్డును త్వరగా బాగు చేయాలి.

– చంద్రారెడ్డి బొల్లారం కౌన్సిలర్

## ఎమర్జెన్సీ తరహాలో బీజేపీ పాలన

**నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**కల్హేర్(నారాయణఖేడ్):** ఎమర్జెన్సీని తలపించేలా కేంద్రంలో బీజేపీ పాలిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం కల్హేర్ మండలం మాసాన్‌పల్లి చౌరస్తాలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ విపక్షం లేకుండా ఉండేందుకు కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. గతంలో కాంగ్రెస్ పాలకులు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. అడుగడుగునా ప్రజలను దోచుకున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అలీ, ఎంఏ.ఘని, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు రవీందర్ రెడ్డి, కిష్టారెడ్డి, శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యానికి సాయం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు:** ఆపత్కాలంలో మెరుగైన వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరిని సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకుంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 67 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన 28 లక్షల 73 వేల రూపాయల విలువైన చెక్కులను ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మినీ ఇండియాగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలో అత్యధిక శాతం పేద,మధ్యతరగతి ప్రజలు జీవనం సాగిస్తున్నారన్నారు. వైద్య చికిత్సల సమయంలో ఎల్‌ఓసీ ద్వారా ముందుగానే ఆదుకోవడంతోపాటు చికిత్స అనంతరం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, జెడ్పీటీసీ సభ్యులు సుధాకర్ రెడ్డి, కుమార్ గౌడ్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, దశరథ్ రెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేష్ గౌడ్, నాయికోటి రాజేష్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఅభయఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీ శ్రీ అభయాంజనేయ, నవగ్రహ, ధ్వజ స్తంభ దేవత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం గోపూజ, గణపతి పూజ నిర్వహించారు. విగ్రహ ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలిత సోమిరెడ్డి, కౌన్సిలర్ జ్యోతి, కాలనీవాసులు పాల్గొన్నారు.



పూజాకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి

### ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



**జహీరాబాద్:** పట్టణంలోని మినీ హజ్ హౌస్ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కె.మాణిక్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నియోజకవర్గంలో వివిధ పండగలు జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మంకాల్ సుభాష్, బీఆర్‌ఎస్ నాయకులు రామకృష్ణ, మొహియొద్దీన్, సురేష్, యూనూస్, జహంగీర్, బాబీ, మిథున్‌రాజ్, గోరేమియా సికందర్, మహ్మద లీ, జలీల్, జకీర్, అక్బర్, సిరాజ్, ముర్తుజా, మొయిన్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

### భూములనుపరిశీలించిన ఆర్డీఓ

**రాయికోడ్(అందోల్):** భూసమస్యను పరిష్కరించాలంటూ పలువురు పట్టాదా రులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయ గా, జహీరాబాద్ ఆర్డీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ ప్రభులు శనివారం జమాల్‌పూర్‌కు వచ్చారు. ఫిర్యాదు చేసిన పట్టాదారుల నుంచి వివరాలు సేకరించి పొజిషన్, పట్టాదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. పట్టాదారుల ఫిర్యాదులు, వాస్తవ భూ రికార్డులపై పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. 39 సర్వే నంబరులో వాస్తవానికి 231.26 ఎకరాల భూమి ఉండగా, సుమారు 320 ఎకరాలు ఉన్నట్లు గతంలో రిజిస్ట్రేషన్లు జరిగాయని, రెవెన్యూ అధికారులు తెలిపారు. భూ క్రయవిక్రయాల్లో అనేక అవకతవకలు ఉన్నట్లు ఉన్నతాధికారులు గతంలోనే గుర్తించారు.

### రేపు గీతంలో 'టెడ్‌ఎక్స్'

**పటాన్‌చెరు టౌన్:** రుద్రారంలోని గీతం విశ్వ విద్యాలయం టెడ్‌ఎక్స్‌కు సిద్ధమవుతోంది. ఈనెల 27న రివైండ్ ది మిలీనియం ఇతివృత్తంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం యువతకు స్ఫూర్తినిచ్చేలా నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు శని వారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ప్రఖ్యాత భారతీయ చలనచిత్ర దర్శకుడు, నిర్మాత, నటుడు గౌతం వాసుదేవ్ మీనన్, ఫ్యాషన్ డిజైనర్, సస్టెన్కీర్ట్ వ్యవస్థాపకురాలు, ఏకమ్ లెర్నింగ్ సెంటర్ సహ వ్యవస్థాపకురాలు శిల్పారెడ్డి, ప్రసిద్ధ చిత్రకారుడు సజ్జాద్ షాహిద్, స్కిప్పి ఐస్ పాప్స్ వ్యవస్థాపక జంట రవి-అనుజాకబ్రా, తెలుగు - ఆంగ్ల పాటల రచయిత, ఇండీ సంగీత కళాకారుడు నితీశ్ కొండపర్తి, ప్రముఖ భరతనాట్య నృత్యకారిణి సవిత శాస్త్రి ప్రసంగిస్తారని తెలిపారు.

## నిరుపేదలకు చేయూత

**ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు**



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్:** బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉండి చేయూతనందిస్తోందని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో11 మంది లబ్ధిదారులకు గాను రూ.4.05లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రభుత్వం పాటు పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముత్యాల చందు, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహులు, జైరాజ్, అరుణ్‌కుమార్, బాబీ, సత్యం, లక్ష్మీకాంత్, సంజు పాల్గొన్నారు.

### సరుకుల బండిలో పరీక్షకు



**నారాయణఖేడ్:** ఖేడ్ మండలం జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇంటర్ పరీక్షలు రాసేందుకు ఖేడ్ పట్టణంలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారు. గురుకుల కళాశాల ఖేడ్ పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కళాశాల నుంచి పరీక్ష కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు రెండు సరుకులు తరలించే చిన్న వాహనాలను సమకూర్చారు. అసలే ఎండలు మండుతున్నాయి. టాపులేని వ్యాన్లు కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని, కొందరు వ్యాన్ టాపుపైకి ఎక్కి ప్రయాణిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇరుకుగా ఉన్న వాహనంలో ఇబ్బందులు పడుతూ విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు.

### బీజేపీ నూతన కార్యాలయ పరిశీలన



బీజేపీ నూతన కార్యాలయం ఎదుట శాంతకుమార్ తదితరులు

**కంది(సంగారెడ్డి):** కంది శివారులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బీజేపీ జిల్లా నూతన కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ శనివారం పరిశీలించారు. ఈనెల 31వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్ల వివరాలు తెలుసుకునేందుకు ఆయన వచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నేతలు జగన్, నాయకులు రామకృష్ణ, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం



ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీని దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**హత్నూర(సంగారెడ్డి):** రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ మండల పరిధిలోని దౌల్తాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీని దహనం చేసి యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రియాజ్ అలీ మాట్లాడుతూ అంబానీ లాంటి దోపిడీదారులకు కేంద్రం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నేతలు ప్రసాద్, వసీం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అంజిరెడ్డికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న అంజిరెడ్డి

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** పారిశ్రామిక వేత్త, బీజేపీ నేత సి.అంజిరెడ్డి చేసిన సామాజిక సేవలను గుర్తించి చెన్నైలోని ఏషియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 నుంచి ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సామాజిక సేవ చేస్తున్నానని, నిరుపేదలు, పేద విద్యార్థులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నానన్నారు.

## సైన్స్ మ్యూజియంలో విద్యార్థుల సందడి



సైన్స్ మ్యూజియంలో పరికరాలను పరిశీలిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**సదాశివపేట రూరల్(సంగారెడ్డి):** మండల పరిధిలోని నందికంది ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం మండల విద్యాధికారి దండు అంజయ్య ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి దండు అంజయ్య మాట్లాడారు. విద్యార్థులు చదివిన, రాసిన దానికన్నా చూసి నేర్చుకుంటే ఎక్కువకాలం గుర్తుంటుందన్నారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సిలబస్‌కు సంబంధించిన పలు అంశాలు మోడల్స్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి విజయ్‌కుమార్, సీఆర్పీలు రాజేశ్వర్, సరస్వతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### సెయింట్ పీటర్స్‌లో గ్రాడ్యుయేషన్ వేడుకలు

**కొండాపూర్(సంగారెడ్డి):** సంగారెడ్డిలోని సెయింట్‌పీటర్స్ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా క్వీన్స్ ఇంగ్లీష్ పరిశోధకులు ఆడమ్, నిఖిల్ హాజరై విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఈ వేడుకల్లో పాఠశాల చైర్మన్ ఆంథోనీ రెడ్డి, కరస్పాండెంట్ రవికుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మర్రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షిప్త వార్తలు

**◆ రేపు మండల సర్వసభ్య సమావేశం**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

**◆ పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** మండల పరిధిలోని రుక్మాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు.

**◆ జాతరకు విరాళం**

**జిన్నారం(పటాన్‌చెరు):** మండల పరిధిలోని వీరారెడ్డిపల్లిలోని ఎల్లమ్మ తల్లి జాతరకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ రూ. 35వేల విరాళం శనివారం నిర్వాహకులకు అందజేశారు. దేవాలయ ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు కాటా దంపతులను సన్మానించారు.

**◆ మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం**

**జిన్నారం(పటాన్‌చెరు):** అనంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త నారాయణ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. అంత్యక్రియలకుగాను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. సర్పంచ్ దీప, ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డిలుమృతుడి కుటుంబ సభ్యులకు ఆ నగదు అందజేశారు.

**◆ తలంబ్రాల బుకింగ్‌ను సద్వినియోగం చేసుకోండి**

**నారాయణఖేడ్:** భద్రాచలం శ్రీసీతారాములవారి ముత్యాల తలంబ్రాలను రూ.116తో బుక్ చేసుకుంటే ఆర్టీసీ ఇంటికే తీసుకొచ్చి ఇస్తుందని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జ్ పాండు అన్నారు. శనివారం ఖేడ్ శ్రీసత్యనారాయణస్వామి ఆలయ వ్యవస్థాపకులు చిన్ని మధుకర్‌స్వామి, మనూరుకు చెందిన రాఘవాచారితోపాటు ఆలయ అర్చకులు తలంబ్రాలు బుక్ చేసుకోగా వారికి రశీదులను అందజేశారు.

**◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ**

**నారాయణఖేడ్:** ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సిఫార్సుతో కంగ్టి మండలం జంగి(కె)కు చెందిన నువ్వుల మారుతి, నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లికి చెందిన విఠల్ రెడ్డికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం మంజూరైంది. ఆ చెక్కులను టీపీసీసీ ఉపాధ్యక్షులు డా.సంజీవరెడ్డి శనివారం తన నివాసంలో అందజేశారు. డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సర్దార్, షాదుల్, గుండెరావు, శివరాజ్, అంజిరెడ్డి, బస్వరాజ్, కృష్ణ, మారుతిరెడ్డి పాల్గొన్నారు.

**◆ సరుకుల అందజేత**

**నారాయణఖేడ్:** ఖేడ్ మండలం నర్సాపూర్‌కు చెందిన సాయవ్వ తల్లిదండ్రులు గతంలో మృతిచెందగా ఆమె అనాథగా మిగిలింది. జీవనం భారం కావడంతో విషయం తెలుసుకుని విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో సభ్యులు శంకర్, అంజాగౌడ్, ప్రశాంత్ శనివారం గ్రామానికి వెళ్లి ఆమెకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.

**◆ చలివేంద్రం ఏర్పాటు**

**జిన్నారం(పటాన్‌చెరు):** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పాత మున్సిపల్ కార్యాలయం ముందు కౌన్సిలర్ నిహారిక ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాలమ్మ, వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**◆ ఆదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు**

**పటాన్‌చెరు టౌన్:** రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణను ఓర్వలేకే కేంద్రంలో బీజేపీ అక్రమ కేసులు పెట్టించిందని తెలంగాణ మాదిగ సంక్షేమసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డయాదయ్య ఆరోపించారు. శనివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ సభ్యత్వాన్ని తొలగించడం అన్యాయమన్నారు.

**◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

**ఝరాసంగం(జహీరాబాద్):** మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. శనివారం గ్రామ సర్పంచ్ బస్వరాజ్ పాటిల్, ఎంపీటీసీ సభ్యుడు శంకర్ పాటిల్ ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**◆ నేడు తిరుమలేశ్వర ఆలయ వార్షికోత్సవం**

**జహీరాబాద్:** పట్టణంలోని ఇండస్ట్రియల్ కాలనీలోని తిరుమలేశ్వర ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిషేకం, శ్రీలక్ష్మీ పద్మావతి సహిత తిరుమలేశ్వరుల కల్యాణ మహోత్సవం, విష్ణు సమస్ర నామ పారాయణం, మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

**◆ పది విద్యార్థులకు అవగాహన**

**న్యాల్‌కల్(జహీరాబాద్):** టెన్త్ తర్వాత తీసుకోవాల్సిన కోర్సులపై విద్యార్థులకు హైదరాబాద్‌లోని వీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది అవగాహన కల్పించారు. మండల పరిధిలోని మామిడ్గి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు, ఇతర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రయ్య, పాఠశాల హెచ్‌ఎం ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

**◆ అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం**

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పాత రామచంద్రాపురం స్నేహ అపార్ట్‌మెంట్స్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత రామచంద్రాపురంలో పూర్తి స్థాయిలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యను పరిష్కారించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాల్లారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అమరేందర్ రెడ్డిలు పాల్గొన్నారు.

**◆ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**హత్నూర(సంగారెడ్డి):** పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఎస్సీ మోర్చా మండల శాఖ అధ్యక్షుడు గోవు మల్లేశం అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రమకు తగ్గ వేతనం ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాగప్రభుగౌడ్, వరిగుంతం శంకర్, గునుకుంట్ల కమలాకర్, ఎర్రసతీష్యాదవ్ ,గ్రామపంచాయతీ కార్మికులు వెంకటయ్య, ఎల్లం, అమృత, శివయ్య ,నరేష్ ,రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.